క్లుప్తంగా

బంగారుపాళెం ఎంపీడీఓగా మహేష్



నూతన ఎంపీడీఓ మహేష్‌తో సిబ్బంది

బంగారుపాళెం: మండల అభివృద్ధి అధికారిగా మహేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బైరెడ్డిపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న శ్రీధర్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఇప్పటివరకు వ్యవహరించారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఎంపీడీఓ మహేష్‌ను కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు, గ్రామ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు అభినందించారు.

వరసిద్ధునికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ట్రస్టులకు ఓ దాత శుక్రవారం రూ. 2.50 లక్షల నగదు విరాళం చేశారు. తమిళనాడులోని చెన్నైకి చెందిన అనికుమార్, సునీత రూ.1.25 లక్షలు, నిత్యఅన్నదానానికి రూ.1.25 లక్షలు గోసంరక్షణ ట్రస్టుకు అందజేశారు. ఈ నగదును ఏఈవో రవీంద్రబాబుకు అందజేశారు. అనంతరం వారికి స్వామి ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ చిరంజీవి

తవణంపల్లె: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతానని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని పటన్నం, ఎగువ తవణంపల్లె రోడ్డు, పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలను మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారిన పడితే సామాన్యుల ప్రాణాలు గాలిలో కలుస్తాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆటోలు అధిక లోడ్డుతో నడిపితే చర్యలు తీసుకొంటామన్నారు.ఎస్ఐతో పాటు హెచ్‌సీ అమీర్‌భాషా, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

తవణంపల్లె: జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ టి.హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. జూన్ 21వ తేదీన జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయడానికి మండలంలో యోగా చేయడానికి ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మండలంలోని 17 సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది యోగా చేసే వారిని ప్రోత్సహించి రిజిస్ట్రేషన్ చేయించాలని పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో 50 మందికి తగ్గకుండా రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. ప్రతి సచివాలయానికి ఒక యోగా టీచర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

బంగారుపాళెం: మండలంలోని పిడివి కండ్రిగకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నలగాంపల్లె పంచాయతీ పిడివి కండ్రిగ గ్రామానికి చెందిన కీర్తిశ్రీ (19) గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం రాత్రి యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఊరంతా సైన్యమే

ఆ ఊరు పేరు చెబితేనే అందరికీ గుర్తు వచ్చేది సైన్యమే. ఏ ఇంటిలో చూసినా సైనికులే. ఎవరైనా చదువుకుంటే ఏ ఇంజినీరో, డాక్టరో అవుతామని చెబుతుంటారు. అయితే ఆ గ్రామంలో మాత్రం ఏది ఏమైనా ప్రతి ఇంటి నుంచి ఒకరు జవాన్ కావాల్సిందే. ఒకే ఇంటిలో ఇద్దరు ముగ్గురు సైనికులూ ఉన్నారు. ఈ ఆర్మీలో చేరడమనేది 90 ఏళ్లకు ముందే అంటే స్వాతంత్ర్యం రాక ముందు నుంచే మొదలైంది. యుద్ధంలో ఎంతోమంది అమరులైనప్పటికీ గ్రామస్తులు ఏమాత్రం వెనుకాడడం లేదు.



రచ్చబండపై ఉన్న మాజీ సైనికులు, (ఇన్‌సెట్) ఓయమ్.రామయ్య(ఫైల్)

- ఇంటింటా సైనికులు
- సుమారు 90 ఏళ్లనాటి ప్రస్థానం
- సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి

గుడిపాల: స్వాతంత్ర్యం రాకముందు గాజులు వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధికి ఆర్మీకి వెళ్లడం మొదలుపెట్టిన ఆ గ్రామస్తులు ఇప్పుడు దేశభక్తితో సైనికులవుతున్నారు. ఈ గ్రామమే గుడిపాల మండలం కుప్పిగానిపల్లె. మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. మొట్టమొదటగా ఇదే గ్రామానికి చెందిన ఓయమ్.రామయ్య 1935లో సుభాష్‌చంద్రబోస్ అడుగుజాడల్లో నడవాలని ఆర్మీలో చేరారు. 1939లో బర్మా- చైనా-భారత్ యుద్ధంలో ఆయన పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితో ఒక్కొక్కరుగా ప్రతి ఇంటిలో సైనికులుగా ఉండాలని ఇంటికో సైనికుడయ్యారు. ఆ తరువాత ఆయన కుమారులైన ఎత్తిరాజులు, హరిక్రిష్ణ, శేషాద్రి కూడా ఆర్మీలో చేరారు. వీరితో పాటు గ్రామంలో జీవనోపాధి లేనివారందరూ క్రమంగా ఒక్కొక్కరుగా సైన్యంలో చేరడం మొదలైంది. ప్రస్తుతం ఈ గ్రామంలో 90 కుటుంబాలు ఉన్నాయి. అందరూ భారత సైన్యంలోనే ఉన్నారు. ఇందులో ఇప్పటివరకు 50 మంది వరకు సైనికులు వీరమరణం పొందగా, మరో 50 మంది మాజీ సైనికులుగా ఇంటి వద్ద ఉన్నారు. ప్రస్తుతం 25మంది వరకు సర్వీసులో ఉన్నారు. ఈ ఊరి సైనికులు 1971, 1978, 1999లో జరిగిన యుద్ధాల్లోనూ పాల్గొన్నారు.

పూరి గుడిసె లేని గ్రామం

కుప్పిగానిపల్లె గ్రామం మొత్తం వీరసైనికులు ఉండడంతో ఎక్కడా పూరి గుడిసె అంటూ కనిపించదు. శుభ్రతలో కూడా వారికి ఎవ్వరూ సాటిరారు. ఈ గ్రామంలో ఉన్న మాజీ సైనికులు గ్రామంలో ఏ పని చేయాలన్నా సర్పంచ్ సహకారంతో అందరూ ఏకమై అభివృద్ధిలో పాల్గొంటారు. పరిసరాలన్నింటినీ శుభ్రంగా ఉంచుకోవడంలోనూ ఇప్పటికీ ప్రత్యేకతనూ చాటుతున్నారు.



కుప్పిగానిపల్లె గ్రామం

యుద్ధంలో పాల్గొన్నా



పాకిస్తాన్, ఇండియాకు 1971లో జరిగిన యుద్ధంలో పాల్గొన్నా. యుద్ధ సమయంలో దేశం గుర్తుకు వస్తుందే కానీ కుటుంబసభ్యులు మాత్రం గుర్తుకురారు. తాను 25 ఏళ్లు ఆర్మీలో పనిచేసి యుద్ధంలో పాల్గొని దేశానికి సేవ చేశానన్న తృప్తి చాలా ఆనందంగా ఉంది.

–శేషాద్రి, మాజీ సైనికుడు, కుప్పిగానిపల్లె

కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నా



దేశంలో సేవ చేయాలన్న తపన నాలో కలిగింది. 1989 లో మా గ్రామస్తుల సూచనల మేరకు ఆర్మీలో చేరా. 1999లో కార్గిల్ యుద్ధం మొదలైంది. దేశభక్తిని చాటిచెప్పే విధంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొని దీటుగా సమాధానం చెప్పాం. 21ఏళ్లు దేశం కోసం సేవలు అందించి రిటైరయ్యాను.

–రవికుమార్, మాజీ సైనికుడు

దేశం కోసమే



దేశం కోసమే ఆర్మీకి వెళ్లాం. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాం. మా గ్రామంలో అందరూ ఆర్మీకి వెళుతుంటే నేను కూడా చేరాను. ఆర్మీలో ఉద్యోగం చేస్తుంటే ఇంటిపై కలవరం ఉండదు. ఎప్పుడూ దేశంకోసం పాటుపడాలన్న తపన మాత్రమే ఉండేది. ఆ తృప్తి మాకు చాలు.

–ఓయమ్.కుప్పయ్య, మాజీ సైనికుడు, కుప్పిగానిపల్లె

ఆనందంగా ఉంది



మా గ్రామం మొత్తం సైనికులమే అంటుంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది. ఎక్కడికి వెళ్లినా నన్ను ఏంబా ఆర్మీ అని అంటుంటారు. ప్రతి ఇంటిలోను ఒక సైనికుడు ఉన్నాడు. వారి వల్ల మా గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోంది. వారి సూచనల మేరకు గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నాం.

–మధుసూదన్‌రాయల్, సర్పంచ్, కుప్పిగానిపల్లె

వరసిద్ధుని సేవలో గుంటూరు ఎస్పీ, కడప కలెక్టర్



స్వామి సేవలో గుంటూరు ఎస్పీ, కడప కలెక్టర్‌కు చిత్రపటం అందజేస్తున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి శుక్రవారం ప్రముఖులు దర్శించుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేశారు. తర్వాత ఈవో పెంచలకిషోర్ వారికి శేషవస్త్రం, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

గ్రామీణులకు ఇంటివద్దే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ పవన్

గుడిపాల: గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యం వినియోగించుకోవాలని 104 వైద్యాధికారి పవన్ తెలిపారు. మండలంలోని కిల్లారిపల్లె గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, మోహన, బాబు, ఇలావతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ జెడ్పీ సీసీకి షోకాజ్

చిత్తూరు కార్పొరేషన్ : పూర్వ జెడ్పీ సీసీ సురేంద్రరెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై షోకాజ్ నోటీసు అందజేశారు. వచ్చిన ఫిర్యాదు ఆధారంగా వాటిని శుక్రవారం అందించినట్లు జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. ఇటీవల విశ్రాంత ఎంపీడీఓ కనకరాజులునాయుడు ప్రభుత్వానికి, పీజీఆర్ఎస్, కలెక్టర్‌కు పూర్వ సీసీపై ఫిర్యాదు చేశారన్నారు. వీటిపై వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని నోటీసు ఇచ్చామని వివరించారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద సర్పంచ్ రత్నయ్య గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. రత్నయ్య మృతి వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ శుక్రవారం మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, జెడ్పీమాజీ చైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గౌరమ్మ, స్థానిక ఎంపీటీసీ మానస, రాష్ట్ర కురబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అమరనాథ్, వార్డు సభ్యులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సామాజిక ఎదుగుదలకు విద్య ఎంతో అవసరం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ నిర్మల

తవణంపల్లె: వ్యక్తిగత, సామాజిక ఎదుగుదలకు విద్య ఎంతో అవసరమని ఐరాల సీడీపీఓ నిర్మల కిశోర బాలికలకు సూచించారు. మండలంలోని చెంగనపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సెషన్–7 కింద విద్య, ఓపెన్ స్కూల్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు ప్రాథమిక విద్య ఎంతో అవసరం అన్నారు. విద్య స్థిరమైన, సంతోషకరమైన జీవితానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. బాలికలు పాఠశాలకు వెళ్లకుండా డ్రాపౌట్లు కాకుండా పాఠశాలలోని చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

జిల్లాను విభజించి.. అభివృద్ధిని మరిచి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాల విభజన సమయంలో చిత్తూరు జిల్లాను మూడు జిల్లాలుగా విభజించి అభివృద్ధి మరిచారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ ఆరోపించారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యే చిత్తూరు జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారన్నారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు అన్ని విధాలుగా వెనుకబడిందన్నారు. పాలకవర్గం చిత్తూరు జిల్లా అభివృద్ధిపై చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు సత్యవేడు ప్రాంతంలో పరిశ్రమల హబ్‌గా ఉండటంతో ఆ ఆదాయ వనరులు జిల్లాకు వచ్చేదన్నారు. సత్యవేడు తిరుపతి జిల్లాలో విలీనం తర్వాత వనరులు నిలిచిపోయిందన్నారు. జిల్లాలో ఉన్నటువంటి 31 మండలాల్లో పుంగనూరు నియోజకవర్గం నుంచి కొన్ని మండలాలు అన్నమయ్య జిల్లాలో విలీనం చేయడం సరికాదన్నారు. దీనికి తోడు నగరిలో కొన్నింటిని తిరుపతి జిల్లాలో కలుపుతామంటున్నారన్నారు. అప్పుడు జిల్లాలో ఆదాయ వనరులు ఏమి ఉండవన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మణి పాల్గొన్నారు.

నకిలీ విత్తు.. రైతు చిత్తు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం అనుకూలించడంతో రైతులు విత్తనాలు చల్లే పనులకు పూనుకున్నారు. ఇదే అదనుగా పలువురు వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను అంటగట్టేస్తున్నారు. ఈ నకిలీ విత్తనాలు నాటి పంట సాగు చేస్తే రైతు దిగుబడి రాక చిత్తయిపోవడం ఖాయం. ఈ నకిలీ విత్తనాలను గుర్తించాల్సిన తరుణమిదే!

- ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్న రైతులు
- విత్తనాల కొనుగోలుపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



విత్తన దుకాణాన్ని, తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

బంగారుపాళెం: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, వేరుశనగ, మిరప ఎక్కువగా సాగు చేస్తుంటారు. వర్షాలు పుష్కలంగా కురిసే అవకాశాలు ఉండడంతో పంటల సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇదే అవకాశంగా కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు తమ దుకాణాల్లో ఉన్నాయంటూ రైతులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇలా బురిడీ కొట్టించి, నకిలీ విత్తనాలు అంటగట్టి, రైతులను ముంచిన దుకాణదారులు లేకపోలేదు. ఏటా నకిలీ విత్తనాల బారిన పడి ఏటా అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలను ముందే గుర్తించవచ్చు, నష్టపోయినా పరిహారం పొందవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

–వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వ అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారులు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉంది. వారి విషయంలో అప్రమత్తంగా ఉండడంతోపాటు వారి సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారిపై చర్యలకు అవకాశం ఉంటుంది.

– ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.

– విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లు తమ పంట చేతికి వచ్చేవరకు రైతులు భద్రపరచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలు ఉంటేనే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి

ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. ఒక వేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే ఆ విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందేందుకు వీలుంటుంది. దీనికోసం రైతులు తమ విత్తన కొనుగోలు బిల్లు భద్రపరచుకోవాలి.

–చిట్టిబాబు, ఏఓ, బంగారుపాళెం

వేధింపులకు వివాహిత బలి

బంగారుపాళెం: పిల్లలు కలగలేదని భర్త, అత్త వేధింపులతో జీవితంపై విరక్తి చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవా రం కొత్తవెంకటాపు రం గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు ఇలా.. మండలంలోని తంబుగానిపల్లె పంచాయతీ కొత్తవెంకటాపురానికి చెందిన ఉదయ్‌కిరణ్‌కు పెనుమూరు మండలం మట్టంపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమార్తె నందినితో మూడేళ్ల కిందట వివా హం జరిగింది. కొంత కాలంగా నందినికి పిల్లలు కలగడం లేదని భర్త ఉదయ్‌కిరణ్, అత్త బుజ్జెమ్మ తరచూ మానసికంగా శారీరకంగా వేధించేవారు. ఈ క్రమంలో నందిని(21) జీవితంపై విరక్తి చెంది ఇంట్లో చున్నీతో ఉరివేసు కుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు, బంధువులు తలుపులు పగులగొట్టి ఆత్మహత్య చేసుకున్న నందిని బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్ట ర్లు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు ఉదయ్‌కిరణ్, తల్లి బుజ్జెమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

తవణంపల్లె: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 27 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల చేతివృత్తులకు ప్రోత్సాహం



టైలరింగ్‌లో మెలకువలను నేర్పిస్తున్న ఇన్‌స్ట్రక్టర్ గీతా

తవణంపల్లె: నిరుద్యోగ మహిళలకు చేతివృత్తుల ద్వారా జీవనోపాధి కల్పించేందుకు కుట్టుమిషన్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు 90 రోజుల పాటు కుట్టుమిషన్లతో టైలరింగ్, ఎంబ్రాయిడింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం 25 కుట్టుమిషన్‌లను సచివాలయంలో ఏర్పాటు చేశారు. మండలంలోని 17 సచివాలయాల ద్వారా శిక్షణకు ఆసక్తి కలిగిన 120 మంది మహిళలను ఎంపిక చేసి శిక్షణకు అవకాశం కల్పించారు. 90 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారికి మాత్రమే ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తారు. శిక్షణలో గైర్హాజరైతే ఉచిత కుట్టుమిషన్లకు అర్హత కోల్పోతారు.

మహిళలకు మంచి అవకాశం

బీసీ కారర్పొరేషన్ ద్వారా నిరుద్యోగ మహిళలకు జీవనోపాధి కల్పించాలనే సంకల్పంతో టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నాం. మహిళలు ఉత్సాహంగా 90 రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టుమిషన్లతో పాటు సర్టిఫికేట్ అందజేస్తాం. నిరుద్యోగ మహిళలకు ఇది మంచి అవకాశం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–శ్రీదేవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్, చిత్తూరు



టైలరింగ్‌లో శిక్షణపొందుతున్న మహిళలు